www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 10-6-2024
Kurnool | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | కర్నూలు

ప్రధాని మోదీకి శ్రీమఠం పీఠాధిపతి అభినందనలు



మంత్రాలయం, జూన్ 9: మూడోసారి భారత ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్రమోదీకి మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అభినందనలు తెలిపారు. భారతదేశంలో మొదటి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూతో సమానంగా ప్రస్తుతం ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేయడం భారతదేశం గర్వించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా ప్రధానితో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడంతో వారిని అభినందించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ప్రమాణస్వీకారం చేయడం సంతోషదాయకమన్నారు. దేశభద్రత, ప్రపంచ శాంతి, రాష్ట్రఅభివృద్ధికి మంత్రి వర్గం ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. రాబోయే ఐదేళ్ల పాలన విజయవంతం కావాలని, రాఘవేంద్రస్వామి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు

- ఆలిండియా స్థాయిలో 3,8వ ర్యాంకులు
- ప్రతిభ కనబరిచిన మరికొంత మంది విద్యార్థులు



తేజేశ్వర్ | హరినాథ్ | మాల్య హాసిని



సందేష్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

కర్నూలు ఎడ్యుకేషన్/గోస్పాడు/ఎమ్మిగనూరు, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు ఆలిండియా స్థాయిలో సత్తా చాటారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండల కేంద్రానికి చెందిన బి.సందేశ్ ఆలిండియా స్థాయిలో 3వ ర్యాంక్ సాధించి సత్తా చాటారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో 338 మార్కులతో 99.99 పర్సంటైల్‌తో మూడో ర్యాంకు సాధించారు. కర్నూలు నగరానికి చెందిన విద్యార్థి కొండూరు తేజేశ్వర్ జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షలో 331/360 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 8వ ర్యాంకు సాధించారు. అలాగే కే.హర్షవర్ధన్ 42వ ర్యాంకు, కే.శివనారాయణ 51వ ర్యాంకు, ప్రణతి 345వ ర్యాంకులను సాధించారు. చిన్నటేకూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ఐఐటీ-మెడికల్ అకాడమికి చెందిన సంతోష్ ఆలిండియా కేటగిరి స్థాయిలో 817, కే.అనిల్ నాయక్ 1032, ఎరుకుల రాజు 1529 ర్యాంకు, ఎం.అభిషేక్ 1783, జి.గణేష్ 1836, మోహన్ కుమార్ 2543, ఆర్.వికాస్ రాజ్ 2971, రత్న చంద్ర 3223, రఘు 3240, ఏ.రాజశేఖర్ 3709 ర్యాంకులు సాధించారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గురుకుల విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్లు అకాడమి డైరెక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు.

- నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బొగ్గులపల్లె రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమారుడు బి.సందేష్ పాఠశాల దశ నుంచే ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ వచ్చారు. పదో తరగతిలో 10కి 10 పాయింట్లు, ఇంటర్మీడియట్‌లో 957 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా బి.సందేశ్ మాట్లాడుతూ ఉత్తమ విద్యా సంస్థలో చేరుతానన్నారు. సివిల్స్ రాసి ఐఏఎస్ కావడం తన ఆశయమని తెలిపారు.

- జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలుకు చెందిన కొండూరు తేజేశ్వర్ 331/360 మార్కులు సాదించి ఆలిండియా కేటగిరి స్థాయిలో 8వ ర్యాంకు సాదించారు. తేజేశ్వర్ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. తండ్రి శేఖర్ ఆస్పరి మండలం చిన్నహాల్తిలో స్కూల్ అసిస్టెంట్‌గానూ, కృష్ణవేణి జూపాడుబంగ్లా మండలం తంగడంచలో పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. విజయవాడ నుంచి ఫిడ్జ్ విద్యాసంస్థలో 6 నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసించారు. పదవ తరగతిలో 570 మార్కులు, ఇంటర్‌లో 981 మార్కులు సాధించారు. జేఈఈ-మెయిన్స్‌లో 331 మార్కులతో 99.918 పర్సంటైల్‌ను సాధించారు. ఈ సందర్భంగా తేజేశ్వర్ మాట్లాడుతూ ఐఐటీ ముంబై విద్యా సంస్థలో సీఎస్ఈలో చేరాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

- జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన హరినాథ్ ఆలిండియా స్థాయిలో ఓవరాల్‌గా 401వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 60వ ర్యాంకు సాధించారు. పట్టణంలోని మునెప్పనగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయ దంపతులు మల్లికార్జున, కృష్ణవేణిల కుమారుడు ఆర్.హరినాథ్ జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచారు. హరినాథ్ 6వ తరగతి వరకు ఎమ్మిగనూరు పట్టణంలో చదవగా, 7వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలల్లో చదివారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు.

- కర్నూలు నగరానికి చెందిన మాల్య హాసిని ఆలిండియా స్థాయిలో ఎస్టీ విభాగంలో 105వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. కర్నూలు సర్వజన వైద్యశాలలో ఫార్మసిస్టుగా పని చేస్తున్న రాజేశ్ నాయక్ కుమార్తె మాల్య హాసిని 231/360 మార్కులు సాధించి ఎస్టీ విభాగంలో జాతీయ స్థాయిలో 105వ ఉత్తమ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం శ్రమించడం వల్లే జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించడానికి దోహదపడిందన్నారు. మద్రాసు ఐఐటీలో చేరాలని ఉందన్నారు. అనంతరం సివిల్స్ రాసి పేదలకు సేవా చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

టీడీపీ కార్యకర్త దారుణ హత్య

- బొమ్మిరెడ్డిపల్లెలో వేటకొడవళ్లతో వైసీపీ కార్యకర్తల దాడి
- సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందిన గిరినాథ్ చౌదరి
- తీవ్ర గాయాలతో బయటపడిన మృతుని తమ్ముడు కళ్యాణ చక్రవర్తి
- మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆమె కుమారుడు రామ్మోహన్‌పై ఫిర్యాదు
- సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ జి.కృష్ణకాంత్



గిరినాథ్ చౌదరి(ఫైల్)

వెల్దుర్తి/పత్తికొండ, జూన్ 9: టీడీపీ కార్యకర్తను వైసీపీ కార్యకర్తలు వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపారు. మృతుని తమ్ముడు తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో ఆదివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన మోదుపల్లి రామాంజనేయులు కుమారులు గిరినాథ్ చౌదరి (33), కళ్యాణ్ చక్రవర్తిలు గ్రామంలో నడుచుకుంటూ ఎస్సీ కాలనీ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న వైసీపీ కార్యకర్తలు వీరితో గొడవకు దిగారు. టీడీపీ గెలిస్తే ఏం చేయగలరంటూ వాదనకు దిగారు. వారితో మాట్లాడుతూనే పక్కనే పొలంలో గడ్డివాము వద్ద ఉన్న వేటకొడవళ్లతో గిరినాథ్ చౌదరి, కళ్యాణ్ చక్రవర్తిలపై దాడికి దిగారు. గిరినాథ్ చౌదరి తలపై వేటకొడవళ్ల వేటు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్యాణ చక్రవర్తి తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కర్నూలుకు తరలించారు.

గ్రామంలో బలమైన వర్గం ఆ కుటుంబం: గ్రామానికి చెందిన మోదుపల్లి రామాంజనేయులు, టీడీపీ జిల్లా కార్యదర్శి మోదుపల్లి సుబ్బరాయుడు (టీడీపీ మాజీ కన్వీనర్) అన్నదమ్ములు. సుబ్బరాయుడు ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నారు. సుబ్బరాయుడు భార్య శైలజ గతంలో ఎంపీపీగా పని చేశారు. గ్రామంలో టీడీపీకి బలమైన వర్గంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైసీపీకి దీటుగా టీడీపీని నడిపిస్తుండటమే విభేదాలకు కారణమని గ్రామస్థులు చెబుతున్నారు.

పోలింగ్ రోజు మొదలైన గొడవ: మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల రోజు గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ వర్గీయులు టీడీపీ వర్గీయులతో ఘర్షణకు దిగారు. అయితే ఎన్నికల సమయంలో గొడవలు ఎందుకని టీడీపీ వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదు. ఎన్నికల ఫలితాల రోజు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో సంబరాలు చేసుకుంటుండగా వైసీపీ వర్గీయులు వారితో గొడవ పెట్టుకున్నారు. టీడీపీ గెలిస్తే 'మీరు మమ్మల్ని ఏమైనా చేయగలరా' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరిద్దరు వైసీపీ కార్యకర్తలకు గాయాలు కూడా అయ్యాయి. అయితే.. దీంతో ప్రతీకారం తీర్చుకోవడం ఖాయమంటూ వైసీపీ వర్గీయులు తొడలు కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆదివారం రోడ్డుపై వెళ్తున్న గిరినాథ్, కళ్యాణ్‌లపై వైసీపీ వర్గీయులు వేటకొడవళ్లతో దాడికి తెగబడ్డారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పాపయ్య, రమేష్, ప్రదీప్‌లతోపాటు మరో పది మంది కలిసి వీరిద్దరిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకునేలోపే నిందితులు పరారయ్యారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జి.కృష్ణకాంత్



హత్యకు గురైన గిరినాథ్ చౌదరి



చికిత్స పొందుతున్న కళ్యాణ చక్రవర్తి

సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ: టీడీపీ కార్యకర్త దారుణ హత్య విషయం తెలుసుకున్న ఎస్పీ బొమ్మిరెడ్డిపల్లెకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలకు ఆదేశాలు జారీ చేశారు.

ఆసుపత్రికి చేరుకున్న టీడీపీ వర్గీయులు: వైసీపీ కార్యకర్తల చేతుల్లో హత్యకు గురైన గిరినాథ్ చౌదరి మృతదేహాన్ని పోలీసులు వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. హత్య విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్య కర్తలు వందలాదిగా వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. దీంతో ఆసుపత్రి ప్రాంతం వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గిరినాథ్ చౌదరి హత్యకు సంబంధించి నిందితులతోపాటు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆమె కుమారుడు రామ్మోహన్‌రెడ్డి, గ్రామ నాయకుడు మధుసూదన్ రెడ్డిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓటమిని జీర్ణించుకోలేకే..: ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు.

అపరకర్మల భవనానికి గ్రహణం

● బహుళ ప్రయోజన వినియోగ భవనంగా మార్పు

● ఎవరికీ అందుబాటులో లేక శిథిలావస్థకు చేరుకుంటున్న భవనం

కర్నూలు(కల్చరల్), జూన్ 9: ఒక బ్రాహ్మణుడు మరణించిన పితృ దేవతలకు అపరకర్మలు నిర్వహించుకోవాలంటే కనీసం పది రోజుల కార్యక్రమాలు వరుసగా ఉంటాయి. అందుకు ఒక ప్రత్యేక భవనం, దానికి సమీపంలో నది లేదా చెరువు, ఇతర జలాశయం అందుబాటులో ఉండాలి. అందుకు కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది సనాతనంగా వస్తున్న వారి సంప్రదాయం. కానీ నేడు బ్రాహ్మణులకు అందుబాటులో అపర కర్మల భవనం లేక తెలంగాణలోని బీచుపల్లి కృష్ణానది వద్ద, లేదా కర్ణాటకలోని హంపిలోని తుంగభద్ర వద్ద లేదా నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రసిద్ధ క్షేత్రాల వద్ద నిర్వహించుకోవాలి. అందుకు రూ.లక్షల్లోనే ఖర్చు అవుతుంది. అయితే నగరంలో బ్రాహ్మణులకు అపర కర్మల భవనం కోసం, పంప్‌హౌస్ వద్ద, తుంగభద్ర నది సమీపంలో స్థలంతోపాటు భవన నిర్మాణం చేపట్టి ఇవ్వాలని. నగరానికి చెందిన పలువురు బ్రాహ్మణ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు నాటి కర్నూలు టీడీపీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి స్థలం కేటాయించారు. నాటి రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆర్థిక సహకారంతో అందించారు. దీంతో బ్రాహ్మణులకు అపర కర్మల భవనం రూ.80 లక్షలపైగా ఖర్చుతో నిర్మితమైంది.



అపరకర్మల నిర్వహణ భవనం వద్ద టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు

● నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన...

ఈ అపర కర్మల భవనాన్ని నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఇతర ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం శరవేగంగా ప్రారంభించారు. తుది దశకు చేరుకుంటున్న సమయంలో ప్రభుత్వం మారిపోయి వైసీపీ ప్రభుత్వం రావడంతో నిధులు లేక కొంత నిర్మాణం ఆగిపోయింది. దీన్ని పూర్తి చేసిన తమకు అందించాలని ఎన్నోసార్లు నగర బ్రాహ్మణ సంఘాల నేతలు విన్నవించినా ప్రభుత్వం వారి విజ్ఞప్తిని పట్టించుకోలేదు.



2018లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన శంకుస్థాపన శిలాఫలకం

● 'తుంగభద్ర' పుష్కరాల్లో భవనం పేరు మార్చేశారు...

తుంగభద్ర నదికి 2020 నవంబరు 20న పుష్కరాలు వచ్చాయి. ఈ పుష్కరాల నేపథ్యంలో బ్రాహ్మణుల కోసం నిర్మించిన ఈ అపర కర్మల భవనం పేరును కాస్తా బహుళ ప్రయోజన వినియోగ భవనంగా మార్చి నాటి ఉప సభాపతి కోన రఘుపతి చేత ప్రారంభించేశారు. అయితే ఇతర కులాలకు చెందిన వారి ఏమాత్రం ఉపయోగపడని ఈ భవనం పేరు మార్పుపై బ్రాహ్మణ సంఘాల నాయకులు ప్రశ్నించినా నాటి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పేరు మారినా ఈ భవనం మాత్రం ఎలాంటి కర్మకాండలకు ఉపయోగపడకుండా శిథిలావస్థలకు చేరుకుంటోందని బ్రాహ్మణ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ పితృదేవతల కర్మల నిర్వహణ కోసం నిర్మించిన ఈ భవనాన్ని పూర్తి చేసి తమకు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

● బ్రాహ్మణులకు న్యాయం చేయాలి...

నగరంతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులకు ఉపయోగపడే ఈ భవనాన్ని నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రారంభించాలని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు సముద్రాల శ్రీధర్, కర్నూలు పార్లమెంటరీ, అసెంబ్లీ కమిటీ కన్వీనర్లు టీవీ రవిచంద్ర శర్మ డి. ఆనందరావు, బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. తాము భవనాన్ని పరిశీలించామని, దీన్ని పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో పూర్తిగా శిథిలావస్థలకు చేరుకుంటుందని బ్రాహ్మణ సంఘాల నేతలు కంచుగంటల శ్యామ్‌సుందర్‌రావు, శ్రీనివాసరాజు, కరణం హరిశర్మ పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: రాష్ట్రంలోని నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక బుధవారపేటలోని కేశవ మెమోరియల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ఉన్న సస్పెన్షన్లను ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు చిన్న నాగస్వామి నాయక్ మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, రాష్ట్ర సహా కోశాధికారి జయకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాయప్ప, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రశాంతిదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు



చిన్నటేకూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: చిన్నటేకూరు డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ-మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు విడుదలైన జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో అద్భుతమైన ర్యాంకులు సాధించారు. ఆలిండియా కేటగిరి స్థాయిలో వి.సంతోష్ 817, కే.అనిల్ నాయక్ 1032, ఎరుకలి రాజు 1529, ఎం.అభిషేక్ 1783, జి.గణేష్ 1836, మోహన్ కుమార్ 2543, ఆర్.వికాస్ రాజ్ 2971, రత్న చంద్ర 3223, రఘు 3240, ఏ.రాజశేఖర్ 3709 ర్యాంకులు సాధించారు. ఐఐటీ మెడికల్ అకాడమీడైరెక్టర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులంతా గ్రామీణ ప్రాంత విద్యార్థులే అన్నారు. అత్యధిక పర్సంటైల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అంకిత భావంతో పని చేసిన అధ్యాపక బృందాన్ని డి.రామసుబ్బారెడ్డి ప్రశంసించారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: దేశ వ్యాప్తంగా మెడికల్ డెంటల్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.సోమన్న, ఎస్.షబ్బీర్ బాషా, డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 700 మార్కులకు గానూ 720 మార్కులు రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటరుకు సంబంధించిన వారు కావడంతో అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. ఎన్‌టీయే విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శరత్ కుమార్, అభి, మహేంద్ర, కళ్యాణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం చారిత్రాత్మకం



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, జూన్ 9: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి విజయం చారిత్రాత్మకమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందారన్నారు. జిల్లాలో పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే గౌరు చరిత అత్యధిక మెజారిటీతో విజయఢంకా మోగించిందని, మంత్రి వర్గంలో గౌరు చరితకు స్థానం కల్పించాలని కోరారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు టీడీపీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతోనే ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిందని, పథకాలన్నింటినీ అమలు చేస్తామన్నారు. టీడీపీ గెలుపొందిన వెంటనే వానదేవుడు కూడా కరుణించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, అల్లాబాబు, అబ్దుల్లా, వేణు ఉన్నారు.

'సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం'



సమావేశంలో మాట్లాడుతున్న మంజునాథ్

కర్నూలు(కల్చరల్), జూన్ 9: సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరమని సమాచార హక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ అన్నారు. ఆదివారం నగరంలోని నరసింహారెడ్డినగర్‌లోగల ప్రైమ్ హోటల్‌లోని సమావేశ హాలులో జరిగిన జిల్లా, మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీలో చేరిన నూతన కార్యకర్తలకు సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచీ రాష్ట్రస్థాయి వరకు న్యాయం కోసం ప్రశ్నించాలంటే సమాచార హక్కు చట్టం అవసరమని, ఈ చట్టం ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఉండాలని సూచించారు. 2005లో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని, అయితే ఈ చట్టం ప్రజల్లోకి పూర్తిస్థాయిలో చేరనందున తమ వంతుగా స్వచ్ఛందంగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ చట్టాన్ని ముందుకు తీసుకువెళ్లి అవినీతిని రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ కార్యదర్శి కిరణ్‌కుమార్, జాతీయ అధ్యక్షురాలు సుమా వలి, సమితి కార్యదర్శి జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవు



గుడిపాడు గ్రామంలో ప్రజలకు సూచనలు చేస్తున్న గూడూరు ఎస్ఐ హనుమంతయ్య

గూడూరు, జూన్ 9: గ్రామాల్లో ఎవ్వరైనా ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని గూడూరు ఎస్ఐ హనుమంతయ్య హెచ్చరించారు. ఆదివారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిపాడు, చనుగొండ్ల గ్రామంలో గూడూరు ఎస్ఐ హనుమంతయ్య పోలీసు సిబ్బందితో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. ఎస్ఐ మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్ అనంతరం గామాల్లో ఘర్షణల జోలికి వెళ్ళకుండా అందరూ కలిసి మెలసి సఖ్యతతో మెలగాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసులు పాల్గొనారు.

శిక్షణతో రాణించాలి

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 9: క్రీడాకారులు క్రీడా శిక్షణ ద్వారా రాణించి ఉజ్వల భవిష్యత్తును పెంపొందించుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఆదివారం స్థానిక దామోదరం సంజీవయ్య మున్సిపల్ హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీలం ముగింపు శిక్షణా కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. పూర్వకాలం సీలంబం క్రీడను కర్రసాముగా పిలువబడేదన్నారు. నేడు రూపాంతరం చెంది సీలంగా ప్రాచుర్యంలో ఉందన్నారు. కార్యక్రమంలో సీలంబం జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సమ్మర్ క్యాంపు సహకరించిన పాల్గొన్నారు.

45 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



ప్యాపిలిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ప్యాపిలి, జూన్ 9: పదో తరగతి 1978-79 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 40 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు 45 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో స్నేహితుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోటా పోటీగా ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాజా హుసేన్, ఇమాముద్దీన్, కమతం భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, మాణిక్యంశెట్టి, పూజారి శ్రీనివాసులు, బైసాని మధు, గాజుల రమణ పాల్గొన్నారు.

ఆదోని అభివృద్ధికి సహకరించండి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసిన డా.పార్థసారథి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహకారాలు అందించాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, శ్రీనివాసవర్మను ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారధి కలిసి కోరారు. ఆదివారం ఢిల్లీలో వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని ప్రాంతం అన్ని విధాలుగా వెనుకబడి ఉందన్నారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. అలాగే మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును కలిసి ఆశీర్వాదాలు పొందారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

సి. బెళగల్, జూన్ 9: అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లుకు జరిమానా విధిస్తామని ఎస్ఐ తిమ్మారెడ్డి ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు. ఆదివారం మండలంలోని నదీతీరా గ్రామాలలో పర్యటించారు. గ్రామాలలో మద్యం, పేకాట, గుట్కా వంటివి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఎన్నికపై హర్షం



డీటీఎఫ్ రాష్ట్ర కమిటీకి ఎన్నికైన కరెకృష్ణ, గట్టు తిమ్మప్ప

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: డీటీఎఫ్ రాష్ట్ర కమిటీలో కర్నూలుకు చెందిన కరె కృష్ణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గానూ, గట్టు తిమ్మప్ప రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీజీ వెంకట్రాముడు, కార్యదర్శి రామన్న ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. డీటీఎఫ్‌లో ఈ ఇద్దరు 25 సంవత్సరాల నుంచి నిబద్ధత, బాధ్యతతో పని చేశారన్నారు. మండల స్థాయి, జిల్లా స్థాయి కమిటీల్లో వివిధ హోదాల్లో పని చేశారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి లో ఏపీజేఏసీ, ఫ్యాప్టో, ఏపీ సేవ్ ఎడ్యుకేషన్ రాయలసీమ ప్రజా సంఘాలు ఇచ్చిన అనేక ఉద్యమాలలో కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు రోశన్న, నాగరాజు గౌడు, ముద్దు రంగప్ప, ఈశ్వర్ రెడ్డి, రమేష్, వెంకటేశప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం



నిండిపోయిన డ్రైనేజీ

సి. బెళగల్, జూన్ 8: గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. గత నాలుగైదు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలు మురుగునీటితో కంపు కొడుతున్నాయి. మారందొడ్డి, ముడుమాల, ఇనగండ్ల గ్రామాలలో సరైన డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం, జూన్ 9: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో రెండు మోటారు సైకిళ్ల ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బుక్కపురం గ్రామానికి చెందిన మనోజ్ అనే యువకుడు రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి వెళుతుండగా ఆళ్లగడ్డ వైపు నుంచి రుద్రవరం గ్రామం వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బుక్కాపురం గ్రామానికి చెందిన యువకుడు మనోజ్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో యువకుడు రుద్రవరం గ్రామంలోని బెస్తకాలనీకి చెందిన యువకుడిగా స్థానికులు గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ మనోజ్‌ను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించారు.

నారా లోకేశ్‌ను కలిసి లక్ష్మీనారాయణ



నారా లోకేష్‌ను కలిసిన కొంకతి లక్ష్మీనారాయణ

కర్నూలు(అర్బన్), జూన్ 9: విజయవాడలోని ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్‌ను రాష్ట్ర కార్యదర్శి కొంకతి లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఎన్నికల్లో జరిగిన పరిణామాలను లోకేశ్‌కు వివరించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గు పాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపు కోసం అర్బన్ పరిశీలకుడిగా పని చేశానని వివరించారు. స్పందించిన నారాలోకేశ్ రాబోయే రోజుల్లో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 9: నగరంలోని 11వ వార్డు ఎర్రబురుజు వద్ద ఉండే మ్యాన్‌హోల్‌తో ప్రజలకు ప్రమాదముందని సీపీఎం నగర కార్యదర్శి షరీఫ్ అన్నారు. ఆదివారం ఎర్రబురుజు వినాయక గుడి వద్ద తెరచి ఉన్న మ్యాన్‌హోల్‌ను సీపీఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ వినాయకగుడి వెనక కల్వర్టులు నిర్మించారని, అయితే మ్యాన్‌హోల్ గత రెండు రోజులుగా తెరుచుకుని ఉండడంతో ప్రజలు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని అన్నారు. నిత్యం రద్దీ ఉండే ప్రాంతం కావడంతో పాదచారులకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. తక్షణమే నగర పాలక సంస్థ అధికారులు మ్యాన్‌హోల్‌ను మూసివేసి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌డి.ఖాజాపాష, రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్టీయూ ఆధ్వర్యంలో అమ్మ అంధుల పాఠశాలలో సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎస్టీయూ కృషి చేస్తుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి తెలిపారు. ఎస్టీయు 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమ్మ అంధుల పాఠశాలలో నిత్యావసర సరుకులను ఎస్టీయూ నాయకులు పంపిణీ చేశారు. గోకారి మాట్లాడుతూ ఎస్టీయూ స్థాపించి నేటికి 78 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. వివిధ పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయులకు అండగా సంఘం నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు సుంకన్న, రాష్ట్ర పూర్వక కార్యదర్శి షఫి, నగర శాఖ రాముడు, శేఖర్, సుధీర్, పాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గళ్ల మాధవికి మంత్రి పదవి కల్పించాలి

కర్నూలు(అర్బన్), జూన్ 9: పిడుగురాళ్ల ఎమ్మెల్యే రజక మాధవికి మంత్రి పదవీ ఇవ్వాలని ఏపీ రజక ఐక్య సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రాజు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బీసీ భవన్‌లో రజక ఐక్య సేవా సమితి ప్రతినిధుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన మాధవీ మంత్రి పదవి ఇస్తే రజకులు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. సమావేశంలో ఆలంకొండ మద్దిలేటి, కౌలుట్ల చాకలి ఈశ్వరయ్య, సురేంద్ర, కే బలరామ్ పాల్గొన్నారు.

జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ ప్రతిభ



నారాయణ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న డీజీఎం గోవర్ధన్ రెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారనీ డీజీఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు. జి.త్రిష 176, సర్వజిత్ 251, సాహేబ్ అలీఖాన్ 278, సాకేత్ సాయి మణికంఠ 1237, శ్రీహిత 1247, రాజశేఖర్ 1277, లాస్య 1801 ర్యాంకులతో పాటు మరెన్నో ర్యాంకులు వచ్చాయన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డీజీఎం గోవర్ధన్ రెడ్డి, డీన్స్ అంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్స్ వేణుగోపాల్ రెడ్డి, జయరామిరెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ




ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య విద్యార్థులు



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారనీ ఏజీఎం మురళికృష్ణ ఆదివారం తెలిపారు. కే.హర్షవర్ధన్ 42, కే.శివనారాయణ 51, ప్రణీతారెడ్డి 345, డి.నోయిల్ తన్మయ్ 1538 ర్యాంకులతో పాటు అనేక మంది ర్యాంకులు సాదించారన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్ఐటీ వంటి విద్యాసంస్థల్లో తమ విద్యార్థులు ఎంపిక కాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఏజీఎం మురళికృష్ణ, డీన్స్ సరళ, బాలాజీ అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎంఎస్ జ్యోతిరాదిత్య ప్రతిభ



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 9: జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలు చెందిన ఎంఎస్ జ్యోతిరాదిత్యకు ఆలిండియా స్థాయిలో (ఈడబ్ల్యూఎస్) విభాగంలో 210 మార్కులు సాధించి 175వ ర్యాంకు సాదించారు. జ్యోతిరాదిత్య తల్లిదండ్రులు ఎంఎస్ సుమిత్ కుమార్ గణిత ఉపాధ్యాయుడు, తల్లి కే.మాధవిలత డీటీపీ ఆపరేటర్ పని చేస్తున్నారు. జ్యోతిరాదిత్య పదో తరగతిలో 492/500 మార్కులు, ఇంటర్‌లో 991/1000 మార్కులు సాధించి జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 180వ ర్యాంకు సాధించాడు.


ఉన్నత స్థాయి ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చిన మాజీ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్‌కు భంగపాటు తప్పలేదు. జగన్ ఒత్తిడితో ఏడాది సర్వీస్‌ను వదులుకొని ఉద్యోగానికి రాజీనామా (స్వచ్ఛంద పదవీ విమరణ) చేశారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ చేతిలో ఓటమి పాలయ్యారు. టీడీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం చంద్రబాబు ఇంతియాజ్‌కు ఐఏఎస్‌గా సముచిత స్థానం కల్పించారు. జగన్ వచ్చాక ఆయనకు అనుకూలంగా మారారు. అదే జగన్‌ను నమ్ముకొని రాజకీయంగా నట్టేట మునిగిపోయారు.



- ఉద్యోగం పోయే.. పదవి రాకపోయే
- జగన్ ఒత్తిడితో కలెక్టరు ఉద్యోగానికి ఇంతియాజ్ రాజీనామా
- కర్నూలు వైసీపీ అభ్యర్థిగా పోటీ
- సైకిల్ వేగానికి కొట్టుకుపోయిన ఐఏఎస్ అధికారి
- టీజీ భరత్ చేతిలో ఘోర పరాభవం

అయ్యోఎస్!?

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన హఫీజ్‌ఖాన్ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌పై స్వల్ప ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఐదేళ్లు అధికారం ఉన్నా నియోజకవర్గం అభివృద్ధి కోసం హఫీజ్‌ఖాన్ చేసిందేమీ లేకపోగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అదే క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మధ్య వర్గపోరు తీవ్ర స్థాయికి చేరింది. ఓ దశలో మళ్లీ హఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇస్తే ఆయన గెలుపు కోసం పని చేసే ప్రసక్తే లేదని ఎస్వీ మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలుస్తోంది. హఫీజ్‌ఖాన్ స్థానంలో ముస్లిం మైనార్టీ అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని జగన్ సహా వైసీపీ అధిష్ఠానం నిర్ణయించి ఆ వర్గంలో అభ్యర్థి కోసం అన్వేషించారు. ఆ సమయంలో కర్నూలు సర్వజన వైద్యశాలలో పని చేస్తున్న ఆర్థోపెడిక్ డాక్టర్ ఇలియాస్ పేరు తెరపైకి వచ్చింది. ఆయన టీజీ భరత్‌ను ఢీకొట్టడం కష్టమని భావించిన వైసీపీ దివంగత డాక్టరు ఇస్మాల్‌కు స్వయాన అల్లుడైన ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ను బరిలోకి దింపింది.



జగన్ ఒత్తిడితోనే ఎన్నికల బరిలోకి..!

డాక్టర్ ఇస్మాయిల్ స్వయాన అల్లుడు ఏఎండీ ఇంతియాజ్. ఆయన స్వగ్రామం కోడుమూరు. డాక్టర్ ఇస్మాయిల్ కుటుంబానికి నగరంలో మంచి పేరు ఉంది. అదే క్రమంలో ఇస్మాయిల్, టీజీ వెంకటేశ్ కుటుంబాల మధ్య మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. నగరంలో వీరిద్దరిని రాం రహీమ్ అనే వారు. ఆ కుటుంబానికి చెందిన ఏఎండీ ఇంతియాజ్ భూపరిపాలన అదనపు ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), సెర్ప్ సీఈవో, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ హోదాలో పని చేస్తుండగా జగన్ రాజకీయాల్లోకి రావాలని ఒత్తిడి చేశాడు. మొదట్లో రాజకీయాలపై ఆసక్తి లేదని తిరస్కరించినా బలవంతంగా ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేయించి కర్నూలు నుంచి పోటీ చేయించారు. చివరకు టీజీ భరత్ చేతిలో 18.876 ఓట్ల తేడాతో ఘోర పరాజయం పొందారు. వాస్తవంగా ఇంతియాజ్‌కు 2025 మే 31వ తేదీ వరకు సర్వీస్ ఉంది. అదే ఉద్యోగంలో ఉండి ఉంటే మరో ఏడాది సీనియర్ ఐఏఎస్ అధికారిగా రాష్ట్ర పాలనలో భాగస్వామ్యమై ఉండేవారు.

చంద్రబాబు హయాంలో సముచిత స్థానం

డిప్యూటీ కలెక్టరు నుంచి ఐఏఎస్ పదోన్నతి పొందిన తరువాత ఇంతియాజ్‌కు నాటి చంద్రబాబు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారు. 2018కి ముందు ఆయన నెల్లూరు, గుంటూరు జాయింట్ కలెక్టరు (జేసీ)గా పని చేశారు. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వంలో 2019 ఫిబ్రవరి 8న కృష్ణా జిల్లా కలెక్టరుగా నియమించారు. అదే ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో కూడా కృష్ణా జిల్లా కలెక్టరుగా 2021 జూన్ వరకు కొనసాగారు. ఆ క్రమంలో జగన్‌కు దగ్గరయ్యారు. ఆ తరువాత జగన్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా నియమించింది. అదే శాఖ స్పెషల్ సెక్రటరీ అదనపు బాధ్యతలు ఇచ్చారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవి కూడా ఇచ్చారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసే సమయంలో కీలకమైన భూ పరిపాలన అదనపు ప్రధాన కార్యదర్శి సెర్ప్ సీఈవో, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి వంటి కీలక పోస్టులో ఉన్నారు. జగన్‌ను నమ్ముకొని రాజకీయాల్లోకి వచ్చి ఉద్యోగం.. హోదా కోల్పోయారని పలువురు చర్చించుకోవడం కొసమెరుపు.

వైసీపీ వర్గాల్లో నలిగిన ఇంతియాజ్

ఇంతియాజ్ కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తే అయినా ఉద్యోగ రీత్యా ఎక్కువ కాలం బయటనే ఉన్నారు. బంధువులు తప్పా ప్రజలతో పెద్దగా ఆయనకు సంబంధాలు లేవు. ఉన్నపలంగా ఉద్యోగం వదులుకొని రాజకీయాల్లోకి రావడంతో ఇక్కడ వైసీపీలో కీలకంగా ఉన్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలపైనే ఆధార పడాల్సి వచ్చింది. ఐదేళ్లుగా వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు ఉన్నాయి. ఎన్నికల వేళ వీరిద్దని సమన్వయం చేయడంలో ఇంతియాజ్ సక్సెస్ కాలేకపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పైగా రాజకీయ అనుభవం లేని ఆయన హఫీజ్ ఖాన్, ఎస్వీ వర్గాల మధ్య రాజకీయంగా నలిగిపోయారని పేర్కొంటున్నారు. హఫీజ్‌ఖాన్ వర్గం కూడా ఇంతియాజ్ గెలుపు కోసం పని చేయలేదని ఆ పార్టీ నాయకులే చెప్పడం గమనార్హం. ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, నాయకులను మచ్చిక చేసుకోవడానికి భారీగా డబ్బు వెచ్చించి ఆర్థికంగా కూడా నష్టపోయాడని నగరంలో చర్చ జరుగుతోంది.

టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 9: భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ-2023 సంవత్సరానికిగాను టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు సెట్కూరు సీఈవో పీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలలో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాలలో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద అర్జున అవార్డులు ఇస్తారని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతోపాటు, ప్రశంసాపత్రం, రూ.15 లక్షల నగదు బహుమతిని అందజేస్తారని తెలిపారు. ఈ అవార్డుకు వెబ్‌సైట్ ఏఐటు//ఎర్రీటచీటజౌరి.జీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆఖరు తేదీ ఈ నెల 14వ తేదీ చివరి గడువు అని వివరించారు.

నేడు సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన వార్షికోత్సవం

కొత్తపల్లి, జూన్ 9: మండలంలోని సంగమేశ్వరం సమీపంలో ఉన్న సిద్దేశ్వరం వద్ద 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు రాయలసీమ ప్రజల హృదయ స్పందన అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సిద్దేశ్వరం వద్ద అలుగు శంకుస్థాపన జరిగి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాయలసీమలోని ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి సిద్దేశ్వరం వద్ద వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా రాయలసీమ హక్కుల అమలుపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. త్వరలో ఏర్పాటు కానున్న నూతన పాలక ప్రభుత్వమైనా రాయలసీమ ప్రాజెక్టు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మంత్రాలయంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంత్రాలయం, జూన్ 9: మంత్రాలయం తుంగభద్ర నది ఒడ్డున గుర్తు తెలియని భక్తుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని కళ్యాణకట్ట దగ్గర తలనీలాలు సమర్పించి నదిలో స్నానాలు ఆచరించి వస్తుండగా.. మృతి చెందాడా.. మరే ఇతర కారణాల వల్ల చనిపోయాడా అన్న విషయం తెలియాల్సి ఉందని మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని భక్తుని మృతదేహంగా కేసు నమోదు చేశామని చెప్పారు. మృతుని వయస్సు 55 నుంచి 58 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎర్రటి చుక్కల అంగి, నశం కలర్ పంచ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అహోబిలంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ



అల్లరి మూకలు వేసిన రాళ్లు



అహోబిలంలో వైసీపీ వర్గీయుల రాళ్ల దాడిలో పగిలిన ఆటో అద్దాలు

ఆళ్లగడ్డ, జూన్ 9: ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామంలో టీడీపీ వర్గీయుడు పుల్లయ్య ట్రాక్టరులో వెళ్తుండగా టోల్ గేట్ చెల్లించాలని వైసీపీ వర్గీయుడు డిమాండు చేశాడు. గ్రామస్థులు కూడా చెల్లించాలా అని నిలదీయడంతో పుల్లయ్యను వైసీపీ వర్గీయులు వెంబడించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వైసీపీ వర్గీయులను అదుపులోకి తీసుకునేలోపే టీడీపీ కార్యకర్తలు పుల్లయ్య, రాంబాబు ఇళ్లపై రాళ్లతో దాడి చేశారు. అంతేకాకుండా అక్కడే ఉన్న ఆటోపై రాళ్లతో దాడి చేసి అద్దాలు పగులకొట్టారు. దీనిపై రూరల్ సీఐ హనుమంత నాయక్ మాట్లాడుతూ ఇరువర్గాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రైవర్, కండక్టర్‌పై మందుబాబుల దాడి

మిడుతూరు, జూన్ 9: ఓర్వకల్లు నుంచి నందికొట్కూరు వైపు వస్తున్న ఆర్‌టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై ఆదివారం రాత్రి మందుబాబులు దాడి చేసి బస్సు అందాలు పగలగొట్టారు. పోలీసులు, ఆర్‌టీసీ డ్రైవర్ తెలిపిన వివరాలివీ.. ఓర్వకల్లు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును చింతలపల్లి సమీపంలో ఉన్న బ్రిడ్జి దగ్గర ముగ్గురు మందుబాబులు ఆపి డ్రైవర్ ముర్తుజావలి, కండక్టర్ శేషన్నపై దాడి చేశారు. పోలీసులు ఘటనా స్థలంలో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మందుబాబులు పరారీలో ఉన్నారు. డ్రైవరు, కండక్టర్లు మిడుతూరు పోలీసులకు ఫిర్యాదు చేసి మిడుతూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. నిందితుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నారు.



డ్రైవర్ ముర్తుజావలి

మెడికల్ కళాశాల విద్యార్థి దుర్మరణం

కర్నూలు, జూన్ 9: నగరంలోని మెడికల్ కళాశాల సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తేజేశ్వర్ రెడ్డి (21) అనే మెడికల్ కళాశాల విద్యార్థి దుర్మరణం చెందాడు. శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన తేజేశ్వరరెడ్డి ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక రాజ్‌విహార్‌లో ఉన్న మెడికల్ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మెడికల్ కాలేజీలోని రీడింగ్ రూమ్‌కు చదువుకునేందుకు వచ్చాడు. కొద్దిసేపు తర్వాత తిరిగి హాస్టల్‌కు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడ్డ తేజేశ్వరరెడ్డిపై బస్సు టైరు ఎక్కడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని తేజేశ్వర్ రెడ్డి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తేజేశ్వర్ రెడ్డి తల్లిదండ్రులు వెంకటనాథప్ప, గీతాలక్ష్మిలు ప్రభుత్వ టీచర్లుగా పని చేస్తున్నారు. తేజేశ్వరరెడ్డి సోదరుడు కూడా ఇటీవలే నీట్ పరీక్ష రాసినట్లు తెలిసింది. తేజేశ్వర్ రెడ్డి మొదటి ప్రయత్నంలోనే ఆలిండియా కౌన్సెలింగ్‌లో ర్యాంకు దక్కించుకున్నాడు. చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తేజేశ్వర్ రెడ్డి(ఫైల్)



సంఘటనా స్థలంలో తేజేశ్వర్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

వైద్య విద్యార్థికి నివాళి

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి దుర్మరణం చెందిన వైద్యవిద్యార్థి తేజేశ్వర్ రెడ్డి మృతి పట్ల కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.హరిచరణ్ తీవ్ర సంతాపం తెలిపారు. ఆదివారం మార్చురీ వద్ద ఉన్న వైద్య విద్యార్థి భౌతికకాయాన్ని హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ డాక్టర్ జయరాం, డిప్యూటీ వార్డెన్ డా.సోమశేఖర్‌తో కలిసి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సందర్శించి నివాళులర్పించారు. మంచి భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థి మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందని, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

కొంప ముంచిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు

- భూములు పోతాయని రైతులు భయపడ్డారు
- పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు మా కొంప ముంచింది. ఈ చట్టం వద్దని ఆ రోజే మా సీఎం జగన్‌కు చెప్పాను. నా మాట విని వుంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు..' అని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల మా భూములు గుంజేసుకుంటారని రైతులు భయపడ్డారు. గడప గడపకు తిరిగినప్పుడు ప్రతి ఒక్కరూ మమ్మల్ని ఇదే అడిగారన్నారు. ఈ టైటిలింగ్‌యాక్టు ఇప్పుడు వద్దని మా జగన్‌కు అధికారులకు చెబితే.. పట్టించుకోలేదన్నారు. పైగా దీన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నించారు. టీడీపీ నాయకులు ఈ యాక్టును బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల పోలింగ్‌కు పది రోజుల ముందు సీన్ రివర్స్ అయిందని వాపోయారు. ప్రచారంలో మా నాయకుల వెంట తిరిగిన రైతులు ఎక్కడ మా భూములు పోతాయోనన్న భయంతోనే టీడీపీకి ఓట్లు వేశారు. మహిళలకు తాము ఫోన్లు చేశామని, వైసీపీ వస్తే మా భూములు గుంజుకుంటారన్న భయంతోనే టీడీపీకి ఓట్లు వేశామని అంటున్నారన్నారు. తాము కొన్ని తప్పిదాలు చేయడం వల్లే ఓడిపోయామని పేర్కొన్నారు. వైసీపీ ఓటమికి ఇసుక పాలసీ కూడా ఒకటని, పట్టణాల్లో గౌండాలు, కూలీలు, ఇసుకపాలసీ వల్లే ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మందుబాబులు కూడా మాకు ఓటు వేయలేదని, నాణ్యమైన మందును తక్కువ ధరలకు ఇస్తామని టీడీపీ చెబితే నమ్మారని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతులకు రూ.లక్ష రుణమాఫీ హామీ ఇద్దామని జగన్‌కు చెబితే నా మాట వినలేదని తెలిపారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, అందువల్లనే తాము ఓటమి చెందామని కాటసాని పేర్కొన్నారు. తాము చేసిన తప్పిదాల వల్లే ఓటమి చెందామే తప్ప మమ్మల్ని ఎవరూ ఓడించలేదని మాజీ ఎమ్మెల్యే పేర్కొనడం కొసమెరుపు.



కుంటలో పడి బాలుడి మృతి

హాలహర్వి, జూన్ 9: నిట్రవట్టి గ్రామంలో మనోజ్ కుమార్(9) నీటి కుంటలో పడి మృతి చెందారని గ్రామస్థులు తెలిపారు. ఆదివారం ఊరు చివర్లో నీటి కుంట వద్దకు ఆడుకుంటూ వెళ్లాడు. కుంట వద్దకు వెళ్లగానే కాలుజారి పడిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు మల్లికార్జున, మీనాక్షి మూడవ సంతానం మనోజ్ కుమార్. ఆ బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

'విజయ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 9: వైసీపీ పాలనలో సమాచారశాఖ రాష్ట్ర కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన విజయ్‌కుమార్ రెడ్డి అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని నంద్యాలకు చెందిన సీనియర్ పాత్రికేయులు చలంబాబు, మధు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజారెడ్డికి వారు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ధనాన్ని అప్పనంగా ఖర్చు చేశారని, రూ.70 కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశామని చెప్పారు. వైసీపీ సోషల్ మీడియాలో ఉన్నవారికి సమాచార శాఖ నుంచి వేల రూపాయలు జీతాలు ఇవ్వడమే కాకుండా అదేశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట రూ.5 లక్షలు వసూలు చేశారని అన్నారు. పత్రికా ప్రకటనల్లో వ్యత్యాసం చూపి రూ.కోట్లలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అయితే టీడీపీ కూటమి ఘన విజయంతో సెలవులను రద్దు చేసుకుని విజయ్‌కమార్‌రెడ్డి సెంట్రల్ సర్వీసెస్‌కు పోయేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనను బదిలీ చేయకుండా నిలుపుదల చేసి విచరణ చేపట్టాలని, విదేశాలకు పారి పోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలని కోరారు. సీనియర్ పాత్రికేయుల ఫిర్యాదు మేరకు ఎస్పీతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.



సీఐకి ఫిర్యాదు చేస్తున్న సీనియర్ పాత్రికేయులు చలంబాబు, మధు

టీడీపీతోనే శాలివాహనుల అభివృద్ధి

రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

ఎమ్మిగనూరు, జూన్ 9: శాలివాహనుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర అన్నారు. ఆదివారం పట్టణంలోని కుమ్మర వీధిలో తాలుకా అధ్యక్షుడు పాండురంగస్వామి ఆధ్వర్యంలో జిల్లా శాలివాహనుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతం కోసం కృషి చేసిన వారిని అగ్రవర్ణాలు పొట్టనపెట్టుకున్నాయని అన్నారు. తనను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఫ్యాక్షన్ గొడవల నుంచి రక్షించడం వల్లే ఈ రోజు ఇక్కడ మాట్లాడగలుగుతున్నానని తెలిపారు. బడుగు, సామాజిక వర్గాలకు సేవలందించేలా ఎమ్మెల్సీ పదవి ఇచ్చి తన రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటునందిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నా శాలివాహనుల అభివృద్ధి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం తుగ్గలి నాగేంద్రతోపాటు సంఘం దక్షిణ భారతదేశ సంఘం అధ్యక్షులు చౌడప్పశెట్టి, పలువురు నాయకులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని తీర్మానం

తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని శాలివాహన సంఘం దక్షిణ భారతదేశం అధ్యక్షుడు శివకుమార్‌చౌడప్ప శెట్టి కోరారు. తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కమిటీ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని చంద్రబాబుకు పంపుతున్నట్లు సంఘం నాయకులు చౌడప్పశెట్టి, సోమేష్, వెంకటరాజు, రంగన్న, నాగరాజురావు, మధు, రావోజీస్వామిలు బీదర్ బాబురాజు తెలిపారు.

బీజేపీ విజయంపై ప్రత్యేక పూజలు


పూజలలో పాల్గొన్న మహిళలు

ఆదోని టౌన్, జూన్ 9: ఆదోని పట్టణంలో బీజేపీ తరపున మొదటిసారిగా ఎమ్మెల్యేగా డాక్టర్ పార్థసారధి ఎంపిక కావడంతోపాటు, కేంద్రంలో నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానిగా పదవి చేపట్టనున్న సందర్భంగా స్థానిక సదాశివపేటలోని గరు దత్తాత్రేయ స్వామి దేవాలయంలో స్థానిక మహిళా మండలికి చెందిన సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలను చేశారు. మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని, స్థానిక బీజేపీ ఎమ్మెలే డాక్టర్ పార్థసారధి ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చిల్లాలే శకుంతల, ఆర్కాట్ రేణుక భాయి, కామ్లే సరోజా బాయి, అంబల్ దాగే మల్లేశ్వరి బాయి, చిల్లాలే సాత్విక పాల్గొన్నారు.

పురంధరేశ్వరిను కలసిన ఎమ్మెల్యే పార్థసారధి

ఆదోని, జూన్ 9: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరినీ ఆదివారం ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదోనిలో మొట్టమొదట సారిగా ఎమ్మెల్యేగా ఆదోని నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని, నియోజక వర్గ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. అందుకు అధ్యక్షురాలు పురంధరేశ్వరి కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం

ఆదోని, జూన్ 9: సైకో పోయాడు.. సైకిల్ వచ్చింది.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. ఆదివారం ఆదోని మండలం డనాపురం గ్రామంలో ప్రజల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కేక్‌ను కట్‌చేసి తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందన్నారు. పంచాయతీల్లో ఎన్నుకున్న గ్రామ సర్పంచు ఉత్సవ విగ్రహాలుగా ఉండిపోయారని, టీడీపీ హయాంలో మాత్రమే గ్రామ ప్రథమ పౌరుడిగా చూస్తారన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సైతం పంపిణీ చేయలేని వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో డనాపురం శేషన్న, మల్లికార్జున, తిక్కన్న, లక్ష్మీనారాయణ, బుద్ధారెడ్డి, మాబాషా పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచుతాం

మద్దికెర, జూన్ 9: మండలంలోని రైతులకు అవసరమయ్యే ఎరువులను ఆర్‌బీకే కేంద్రాల్లో నిల్వ ఉంచుతామని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "రైతుభరోసా కేంద్రాల్లో ఎరువుల్లేవ్" అనే వార్తకు ఆయన స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రతి ఆర్‌బీకే కేంద్రంలో రైతులకు అవసరమయ్యే ఎరువులను నిల్వ ఉంచి ఎంఆర్‌పీ ధరలకు విక్రయిస్తామని పేర్కొన్నారు.

కుర్చీ వదలని వైసీపీ నేతలు

మద్దికెర, జూన్ 9: వైసీపీ నాయకులకు ఇంకా పదవి వ్యామోహం పోలేదు. సాధారణంగా ఎన్నికల్లో పార్టీ ఓడిపోతేనే నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారు రాజీనామా చేయాలి. కానీ, మండలంలోని వైసీపీ నేతలు నామినేటెడ్ పదవులకు ఇంకా రాజీనామా చేయకపోవడంతో ఈ నాయకులు పదవులు వదలడం లేదనే చర్చ జరుగుతోంది. మండలంలో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్దికెర గ్రామానికి చెందిన ఇరిగేషన్ డెవలప్మెంటు డైరెక్టర్‌గా ఆర్.వెంకటేశ్వర్లు, పత్తికొండ, ఎం.అగ్రహారం గ్రామాలకు చెందిన ఫక్కీరప్పను పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా, పెరవలి రంగనాథస్వామి ఆలయ ఛైర్మన్‌గా దస్తగిరి గౌడు, మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా కవిదాసు, ఉమాదేవి, ఉలిగయ్యలను, సహకార సంఘాలకు ఛైర్మన్లనుగానూ నామినేటెడ్ పోస్టులు ఇచ్చి కూర్చోబెట్టారు. అయితే, బురుజుల సింగిల్ విండో అధ్యక్షుడు సుబ్బయ్య మాత్రమే రాజీనామా చేశారు. మిగత వారు ఎవరూ కూడా రాజీనామా పత్రాలను సమర్పించలేదు. ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయఢంకా మోగించడమే కాకుండా పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు విజయంసాధించారు. ఈ విషయం తెలిసిన నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయకపోవడంతో పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అధికార దాహంతోనే పదవులకు రాజీనామా చేయడం లేదని వాపోతున్నారు.

పల్లెల్లో స్నేహభావంతో మెలగాలి: ఎస్సై

హాలహర్వి, జూన్ 9: ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పల్లెల్లో అందరూ స్నేహభావంతో మెలగాలని ఎస్సై నరేంద్ర అన్నారు. ఆదివారం బాపురం, గూళ్యం గ్రామాల్లో ఇరుపార్టీల నేతలు కౌన్సెలింగ్ నిర్వహించారు. పల్లెల్లో ప్రశాతంగా ఉండాలంటే అందరూ కలసి మెలిసి ఉండాలని, పార్టీలను వదిలి గ్రామస్థులంతా ఐకమత్యంగా ఉంటే అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

రామోజీరావుకు కొవ్వొత్తులతో నివాళి

ఆస్పరి, జూన్ 9: ఈనాడు సంస్థల అధినేత అక్షర యోధుడు రామోజీరావుకు ఆదివారం మండల టీడీపీ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకులు సతీష్ కుమార్, మహానంది, వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మీడియా రంగమే కాక అనేక రంగాలలో ప్రతిభ పాటవాలు సమాజానికి నేర్పిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో పి కిష్టప్ప, ఈశ్వర్, వీరేష్, ఉసేని, శ్రీను పాల్గొన్నారు.

అరాచక పాలన అంతమైంది

మంత్రాలయం, జూన్ 9: ఐదేళ్లుగా రాష్ట్రంలో సాగించిన అరాచక, దౌర్జన్య పాలన అంతమయ్యిందని, ఇక చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి మార్గం సుగమమైందని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం కోసిగి, కౌతాలం, మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాల నుంచి మహిళలు, చిన్నారులు, తెలుగు తమ్ముళ్లు పెద్ద సంఖ్యలో వచ్చి కేక్ కట్ చేసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. అనంతరం ఓటమికి గల కారణాలు గ్రామాల వారీగా సమీక్షించారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, బొజ్జప్ప, భీమిరెడ్డి, నాగరాజు, కేశన్న, రాఘవేంద్ర, రామక్రిష్ణ పాల్గొన్నారు.

కల్తీ పత్తి విత్తనాలకు కేరాఫ్ మాధవరం చెక్‌పోస్టు


మాధవరం చెక్‌పోస్టు

- మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు జోరుగా కల్తీ పత్తి విత్తనాల రవాణా
- పట్టించుకోని వ్యవసాయాధికారులు
- నష్టపోతున్న రైతులు

మంత్రాలయం, జూన్ 9: మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో కల్తీ పత్తి విత్తనాలు జోరుగా రవాణా అవుతున్నాయి. కర్ణాటక సరిహద్దులో ఉన్న మాధవరం చెక్‌పోస్టు కేరాఫ్‌గా చేసుకొని ఈ దందా సాగిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటక నుంచి మాధవరం చెక్‌పోస్టు ద్వారా ఆటోలు, బొలేరో వాహనాలు, కార్ల ద్వారా యథేచ్ఛగా ఆంధ్రలోకి కల్తీ విత్తనాలను రవాణా చేస్తున్నారు. వీటిని తనిఖీ చేసి నివారించాల్సిన అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో నకిలీ పత్తి విత్తనాలు తక్కువ రేట్లలో లభ్యం అవుతుండటంతో నదీతీర గ్రామాల రైతులు కొనుగోలు చేసి మోసపోతున్నారు. తెలంగాణాలోని ఐజ, గద్వాల, గట్టు, కర్ణాటకలోని రాయచూరు, మాన్వి, ఎరిగేరి, గిలకసూగూరు నుంచి అందమైన ఆహ్లాదకరమైన తెల్లని కాటన్ క్లాత్‌తో సీల్ వేసిన ప్యాకెట్లలో ఆంధ్రాకు చేరుతున్నాయి. కొద్ది రోజుల క్రితం చెక్‌పోస్టులో తనిఖీ చేస్తుండగా దాదాపు 150 సంచులకు పైగా నకిలి పత్తి విత్తనాలు పట్టుబడినట్లు సమాచారం. అయితే, కొంత మంది రాజకీయ నాయకుల ఒత్తిడితో బ్రోకర్లు రంగంలో దిగి మామూళ్లు ఇచ్చి పత్తి విత్తనాలు సీజ్ కాకుండా బయటపడినట్లు తెలిసింది. ప్రతిరోజూ క్వింటాల్‌కు పైగా పత్తి విత్తనాలు రవాణా అవుతున్నా చెక్ పోస్టు సిబ్బంది చూస్తూ ఊరుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదే అదునుగా భావించిన అక్రమ వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక నుంచి మాధవరం చెక్‌పోస్టు మీదుగా మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, ఆదోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, దేవనకొండ, ఆస్పరి మండలాలకు సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది మంత్రాలయం నియోజకవర్గం కోసిగిలో 8,600 హెక్టార్లు, కౌతాళం 22 వేల హెక్టార్లు, మంత్రాలయం 13 వేల హెక్టార్లు, పెద్దకడుబూరు 9వేల హెక్టార్లలో పత్తి పంట సాగు 2024 ఖరీఫ్‌లో చేస్తున్నారు. అనుమతులు ఉన్న పత్తి విత్తనాలు అధిక ధర ఉండటం, సులువుగా, అప్పుగా విత్తనాలు విజయదశమికి ఇవ్వాలని శరతులు ఉండటంతో తేలిగ్గా రైతులు నకిలీ విత్తనాలపై మోజు పడుతున్నారు. ఇప్పటికైనా రైతులు నకిలీ విత్తనాల మోజులో పడకుండా రవాణాను అరికట్టి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

42 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక


ఉపాధ్యాయులతో కలసి పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 9 : 42 ఏళ్ల కిందట విడిపోయిన పూర్వ విద్యార్థులు మళ్లీ కలుసుకోవడానికి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వేదికయ్యింది. 1981-1982 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోటికి చేరి ఆనంద క్షణాలను ఆస్వాధించారు. ఈ బడిలో చదివిన పూర్వవిద్యార్థుల్లో యు.యు ప్రసాద్ ఏసీబీ జడ్జి, సోమశేఖర్ ఎం ఈ ఓ, బోడఈరన్న ఎం ఈ ఓ, వేంకటెశ్వర్లు డీఎం టెలికాం, శ్రీనివాసులు ఏఈ, ఇలియాస్ ఎస్‌బీఐ మేనేజర్ వివిధ హోదాలలో ఉన్నారు. వీరంతా ఆదివారం తమకు విద్యాబుద్ధులు నేర్పిన చదువులమ్మ ఒడికి మళ్లీ చేరుకొని గత స్మృతులను తలచుకొని, ఒకరినోకరు అప్యాయంగా పలకరించుకొని వారి బాగోగులు తెలుసుకున్నారు. ఆ రోజుల్లో తరగతి గదుల్లో చేసిన అల్లరిని తలుచుకొని భావోద్వేగానికి గురయ్యారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఉపాధ్యాయులు నర్సప్ప, సుజై ప్రేమ్‌కూమార్, వెంకటలక్ష్మి, అన్నపూర్ణమ్మ హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులకు పూలమాలలు వే సి బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గడిగె లింగప్ప విద్యావేత్త, లలిత్ జైన్, నాగేష్, వేంకటేష్ పాల్గొన్నారు.

ఆదోనిని రెండో ముంబాయిగా తీర్చి దిద్దుతాం

బీజేపీ అన్యభాషా రాష్ట్ర కన్వీనర్, మజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్


4 మాట్లాడుతున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ఆదోని టౌన్, జూన్ 9: పారిశ్రామికంగా రెండవ ముంబాయిగా పేరు పొందిన ఆదోని పట్టణాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి సహకారంతో అభివృద్ధి చేసి తిరిగి రెండో ముంబాయిగా తీర్చిదిద్దుతామని బీజేపీ అన్యభాషా రాష్ట్ర కన్వీనర్, మజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న నేషనల్ టెక్స్టైల్స్ కార్పొరేషన్ (ఎన్‌టీసీ) వారికి సంబంధించిన ఖాళీ స్థలంలో ఒక స్పిన్నింగ్ మిల్‌ను ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఎమ్మెల్యే పార్థసారధి బీహెచ్‌ఈఎల్‌కు డైరెక్టర్‌గా ఉండడంతో ఇక్కడ ఒక అనుబంధ పరిశ్రమను నెలకొల్పాలని కోరతామన్నారు. నియోజకవర్గంలో ఏ అభివృద్ధి గురించి అయినా ఎమ్మెల్యే పార్థసారధి సమక్షంలో చర్చించాకే అమలు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో మైనారిటీల కోసం జూనియర్ కాలేజీ, ఐటీఐ కాలేజీ, షాదీమానాల నిర్మాణాల కోసం కేంద్రం రూ. 40కోట్లు మంజూరు చేసిందని, అసంపూర్తిగా ఉన్న ఆ నిర్మాణాలను పూర్తి చేస్తామని అన్నారు. మతసామరస్యానికి ప్రాధాన్యత ఇస్తామని, మైనారిటీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. పట్టణంలో మూతబడ్డ ఈయస్‌ఐ ఆస్పత్రిని తిరిగి నిర్మించాలని, ఒక సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కేంద్రంను కోరతామన్నారు. సమావేశంలో మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రషీద్, పట్టణ అధ్యక్షుడు సత్తార్, మజీ కౌన్సిలర్ వెంకటేషులు పాల్గొన్నారు.

బయోపై నిఘా ఏది?



- యథేచ్ఛగా నిషేధిత బయో మందుల అమ్మకాలు
- ధనార్జనే ధ్యేయంగా దుకాణదారులు
- మానవ జీవన విధానంపై నిషేధిత అవశేషాల ప్రభావం

దేవనకొండ, జూన్ 9 : మానవ జీవనవిధానంపై నిషేధిత బయో మందుల ప్రభావం రోజురోజుకీ పెరిగిపోతోంది. నివారణ అనితర సాధ్యంగా మారుతోంది. పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడి సాధించే క్రమంలో బయో మయాలో రైతు చిక్కుకుంటారు. బయోమందుల వాడకంతో భూమి సాంద్రత ఘననీయంగా తగ్గిపోతుంది. భూమి సారవంతం కాపాడే జీవామృతం, ఘనామృతం, పశువుల ఎరువుల వాడకం తగ్గిపోవడంతో భూమిలో పోషకాల శాతం క్షీణిస్తుంది. బయోమందుల వాడకం మానవ జీవనంపై, పశువుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. నిషేధిత బయోల వాడకం నానాటికీ మార్కెట్‌లో విచ్చలవిడిగా పెరిగిపోతోంది. అనుమతులు పొందిన కంపెనీల మాదిరిగానే బయో మందుల డబ్బాలపై లేబుల్ గుర్తించలేనంతంగా ఉండటంతో అడిగేవారు కరువయ్యారు. బయో మందుల అమ్మకం దుకాణదారులకు అధిక ఆదాయం సయకూర్చుతుండటంతో వాటి అమ్మకాల పైనే ఆసక్తి చూపుతున్నారు. ధనర్జానే ధ్యేయంగా వ్యాపారులకు బయో మందుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా జోరుగా నడుస్తోంది. అనతికాలంలోనే వ్యాపారులు రూ.కోట్లకు పడగ లెత్తుతున్నారు.

నిషేధిత బయో మందుల వాడకంతో నష్టాలు

- సింథటిక్ మందుల వాడకంతో పంట ఉత్పత్తి నుంచి ఆహారం ద్వారా నేరుగా మానవ శరీరంలోకి కెమికల్స్ వెళ్లడంతో వివిధ రకాల వ్యాధుల బారీన పడతారు. గర్భిణులు తీసుకుంటే పుట్టబోయో నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రభావం చూపి అంగవైకల్యం, బుద్ధిమాద్యం లాంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదముంది.
- భూమి సాంద్రత నశించి సహజత్వాన్ని కోల్పోయి పంటలు సరిగ్గా పండవు.
- పంటలకు దిగుబడి పెంచే మిత్ర పురుగుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది.

నిషేధిత బయో మందుల అమ్మకాలను నివారించాలి



వ్యవసాయ రంగంలో నిషేధిత బయోమందుల వాడకం రోజురోజుకు పెరిగిపోతోంది. నివారించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు జరుపుతున్నారు. నిషేధిత బయో మందుల అమ్మకాలు జరగకుండా చూడాలి.

- వీరశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


ఎస్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్9: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయం ఎదుట ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మాట్లాడుతూ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బాబయ్య ఆడివన్న, ఎల్లప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగభూషణం, తిమ్మరాజు, నాగరాజు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం


కల్వర్టు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తుగ్గలి, జూన్ 9: భారీ వర్షానికి కొట్టుకుపోయిన తుగ్గలి-మామళ్లకుంట కల్వర్టు మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మి ఆదివారం తెలిపారు. తుగ్గలి, మామళ్లకుంట, ఎద్దులదొడ్డి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిలో మూడు రోజుల క్రితం వర్షానికి కల్వర్టు కొట్టుకుపోవడంతో ఆంధ్రజ్యోతిలో 'భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు' అనే శీర్షికకు స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు హుటాహుటిన రహదారి మరమ్మతు పనులను చేపట్టారు.

కేఈ శ్యాంబాబుకు మంత్రి పదవి ఇవ్వాలి

తుగ్గలి, జూన్ 9: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసే ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు మంత్రి పదవి ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబే అని, బీసీ కోటా కింద మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. వెనుకబడిన ప్రాంతమైన పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే శ్యాంబాబుకు ఖచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కౌశిక్ కుమార్, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ సొసైటీ క్లర్క్ మృతి


మోహన్(ఫైల్)

ఎమ్మిగనూరు, జూన్9: మండల పరిధిలోని ఎర్రకోటలో ఉన్న కడిమెట్ల ప్రాథమిక సహకార పరపతి సొసైటీలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్(53) రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మూడు రోజుల క్రితం మోహన్ సొసైటీ నుంచి పార్లపల్లి గ్రామానికి కలెక్షన్‌ల కోసం మోటారు సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మోహన్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సొసైటి ఛైర్మన్ కె.పద్మావతి, దయాకర్‌రెడ్డి, సీఈవో దత్తాత్రేయస్వామి, సిబ్బంది సంతాపం తెలిపారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జూన్ 9 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన కర్నాటక, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మహరాష్ట్ర లనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజామునుంచే స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం, పరిమళ ప్రసాద క్యూలైన్‌న్లు వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలకు,పూజ సామాగ్రికి డిమాండ్ పెరిగింది. భక్తులు మఠం పండితుల ఆశీస్సులు పొందారు.

మద్దమ్మకుంటకు వర్షపు నీరు రాక

● మండలంలో మొత్తం 20 సెం.మీలు

మద్దికెర, జూన్ 9: ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ద్వారా వర్షాలు బాగానే కురుస్తున్నాయి. మండలంలో ఇప్పటి వరకు మొత్తం 20 సెం.మీల వర్షపాతం నమోదైంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నుంచి మద్దమ్మ కుంటకు వర్షపు నీరు రాలేదు. ఈ ఏడాది వర్షపు నీరు కుంటకు చేరుకుంది. రైతులు మే నెలలోనే పంట పొలాల్లో వేసవి దుక్కులు దున్నుకోవడంతో, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంట పొలాలు పదునెక్కి విత్తనాలు విత్తేందుకు అనుకూలంగా ఉన్నాయి. గత వారం రోజులుగా రైతులు విత్తన కొనుగోలులో బిజి బిజిగా ఉంటున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండటంతో రైతులు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. పొలాల్లో వర్షపు నీరు పుష్కళంగా నిల్వ ఉండటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు .బురుజుల గ్రామంలో అధిక వర్షాల వల్ల రోడ్డెక్కి నీరు పారుతుండటంతో కల్వర్టు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఏదీ ఏమైనా ఈ ఏడాది వర్షాలురైతన్నలకు మంచి సూచనలు కనిపిస్తున్నాయి. మరోపక్క అధిక వర్షాల వల్ల పచ్చి కరువు పెట్టుకుందన్న భయాందోళనలో రైతులు ఉన్నారు.

వర్షాకాలంలోనూ తాగునీటికి కటకట

- నెల రోజులైనా నాగనతనహళ్లి రిజర్వాయర్ స్కీమ్ నీళ్లేవి?
- అలిగేర గ్రామస్థులకు బోరుబావులే దిక్కు
- ఫ్లోరైడ్ బారిన పడుతున్న గ్రామస్థులు
- పట్టని ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులు


అలిగేరలో మినీ ట్యాంకుల వద్ద తాగునీటి కోసం బిందెలను వంతులుగా పెట్టుకున్న గ్రామస్థులు

ఆస్పరి, జూన్ 9: గ్రామ పంచాయతీ పాలకులు, సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మండలంలోని ఆలిగేరా గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారు. తాగునీటి వనరులు, పథకాలు ఉన్నా, వాటిని గ్రామస్థుల దరికి చేర్చడంలో విఫలమయ్యారు. ప్రస్తుత వర్షాకాలంలోనూ తాగునీటి కోసం గ్రామ సమీపంలోని బోరు బావులను ఆశ్రయిస్తూ నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా లభించే నీటిని తాగుతూ, ఫ్లోరైడ్ బారిన పడుతున్నామని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు 6000 జనాభా ఉన్న గ్రామానికి నాగనాతనపల్లి రిజర్వాయర్ వాటర్ స్కీమ్ నీరు నెల రోజులకు ఒక్కసారి కూడా రావడం లేదు. ఎప్పుడు నీరు పంపిణీ చేస్తారో తెలియదు అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న బోరు నీటి కోసం బిందెలను రోజుల తరబడి మినీ ట్యాంకులు వద్ద వంతులుగా పెడుతున్నారు... ఈ విషయమై ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేష్‌ను వివరణ కోరగా, మేము తాగునీటిని సక్రమంగా పంపిణీ చేస్తున్నాము. ఏమైనా విద్యుత్, పైప్‌లైన్ మరమ్మతులు చేసేటప్పుడు మాత్రమే నీటిని పంపిణీ చెయ్యడంలో కొంత ఆలస్యం అవుతందని, ఏదైనా సమస్య ఉంటే గ్రామపంచాయతీ చూసుకోవాలి అని వివరణ ఇచ్చారు...

● తాగునీటి కష్టాలు తీరేది ఎన్నడో

మా గ్రామంలో తాగునీటి సమస్యను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామపంచాయతీ అధికారులు, సర్పంచుకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదు. తాగునీటి కష్టాలు ఎప్పుడు తీరుతాయో.

- బసవరాజు, అలిగేర గ్రామం

● నెల రోజులైనా రిజర్వాయర్ నీరు సరఫరా కాలేదు

నాగనాతనపల్లి వాటర్ రిజర్వాయర్ స్కీమ్ మా గ్రామానికి అనుసంధానం చేశారు. నెల రోజులు గడిచినా ఆ నీరు సరఫరా కావడం లేదు. ఈ విషయమై మండల ఉన్నత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. - పోలికంటయ్య, అలిగేర గ్రామం